కాసాని గెలుపుతోనే..

కాంగ్రెస్‌కు గుణపాఠం

బీసీ నేతకు టికెట్ ఇస్తే కాంగ్రెస్ నేతలు ఓర్వలేకపోతున్నరు

ఐక్యంగా ఉంటే బీసీలదే రాజ్యాధికారమంటున్న బీసీ సంఘాల నేతలు

రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని బీసీ సంఘాల నేతలు మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వకపోగా.. బీసీలకు టికెట్ ఇస్తే కూడా ఓర్వలేకపోతున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాసాని గెలుపు కాంగ్రెస్‌కు గుణపాఠం కావాలని, బీసీలంతా ఏకమైతే చేవెళ్ల లోకాసాని గెలుపు అసాధ్యం కానే కాదని నేతలు పేర్కొంటున్నారు. బీసీలకు కులహంకార పార్టీలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో బీసీలు తమ దమ్మేంటో చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్యంగా ఉంటే బీసీలదే రాజ్యాధికారమని ఘంటాపథంగా చెబుతున్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా.. బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి తీరుతామని స్పష్టం చేస్తున్నారు. బీసీలు ఐక్యంగా ఉండరు.. అన్న భావనను ఈ ఎన్నికల్లో నిరూపించాలని పిలుపునిస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కల్పించిన ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బీసీల ఐక్యతపై సమాజానికి ఓ స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని ఇద్దామంటున్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) :

బీసీ నేతను గెలిపించుకుందాం

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించుకుంటే బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీల్లో ఐక్యత లేకపోవడంతో మన హక్కుల సాధనలో వెనుకబడిపోతున్నాం. గతంలో జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్లమెంట్‌కు పంపితే బీసీల గొంతును పార్లమెంట్‌లో వినిపిస్తారు. చేవెళ్ల గడ్డపై బీసీ నేతకు వచ్చిన అవకాశాన్ని మనమంతా వినియోగించుకుని పార్టీలకతీతంగా కాసానిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రాపోలు నర్సింహులు, ప్రజా చైతన్యసమితి రాష్ట్ర అధ్యక్షుడు

కాసానిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థిగా బరిలో నిలిచిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలను పట్టించుకోవడంలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం సీట్లు బీసీలకు కేటాయించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు. చేవెళ్ల స్థానాన్ని బీసీ నేత కాసానికి కేటాయించడంపై బీసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దమ్ముంటే కాసానిని ఎంపీగా గెలిపించుకోవాలని ఓ నాయకుడు విసిరిన సవాల్‌ను బీసీలందరూ గమనించి మన ఓట్లు మన బీసీ నేతకు వేసి భారీ మెజార్టీతో ఎంపీగా జ్ఞానేశ్వర్‌ను గెలిపిద్దాం.

- పి. అంజయ్య, బీసీ నేత, షాబాద్ మండలం

బీసీలందరం ఏకం కావాలి

బీసీలందరం ఐక్యంగా ఉండి బీసీ గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉన్నది. సమిష్టిగా కృషి చేసి మన నాయకున్ని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. కాంగ్రెస్, బీజేపీలు మాత్రం అందుకు భిన్నంగా అగ్రకులాలకు చెందిన వారికి టికెట్లు కేటాయించాయి. ఉమ్మడి రంగారెడ్డి చైర్మన్‌గా ఉన్నప్పుడు కాసాని బీసీల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. బీసీలు రాజకీయాల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాల్సిన అవసరం వచ్చింది.

- ప్రభాకర్, వికారాబాద్

బీసీల కోసం పని చేసే నాయకుడిని గెలిపించుకోవాలి

ఎన్నో ఏండ్లుగా బీసీలు ఓటు బ్యాంకుగా మారడమే తప్పా రాజకీయాల్లో రాణించేందుకు అవకాశాలు రాలేదు. ఈసారి చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా బీసీ బిడ్డ అయిన కాసాని జ్ఞానేశ్వర్‌కు అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే కాసానికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. బీసీలపై కొందరు నాయకులు చిన్న చూపు చూస్తున్నారు. జనాభాలో బీసీల సంఖ్య ఎక్కువగా ఉన్నది.

- మల్లేశ్‌యాదవ్, మదన్‌పల్లి, వికారాబాద్

మన ఓట్లు మనమే వేసుకుందాం

ఇంత కాలం బీసీలను ఓట్లు కాసే చెట్లుగా మల్చుకున్నారు. బీసీల్లో చైతన్యం వచ్చింది. మన ఓట్లు మనమే వేసుకుందాం. బీసీ నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని తీరుతాం. బీసీల కులాల ఐక్యత కోసం సంవత్సరాల తరబడి పోరాటం చేసిన నేత కాసాని. అలాంటి వ్యక్తి ఏ పార్టీ నుంచి చేవెళ్ల ఎంపీ బరిలో ఉన్నాడనేది ముఖ్యం కాదు. బీసీ నేతగా గెలిపించుకునే బాధ్యత ప్రతి బీసీ బిడ్డపై ఉంది. బీసీని గెలిపించుకొని బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం.

- చిన్నపాక విజ్ఞేశ్వర్‌యాదవ్, బడంగ్‌పేట

బీసీలు ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైంది

అధికారం సాధించుకోవడానికి బీసీలు ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైంది. చీలికలు పేలికలుగా బీసీలు విడిపోయి ఉంటే బీసీలకు ఎప్పుడూ అధికారం రాదు. అధికారంలోకి రావాలంటే చేవెళ్ల పార్లమెంట్ నుంచి ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి. బీసీలు అమ్ముడు పోతారని, బీసీల్లో ఐక్యతలేదని, వారు ఎప్పుడూ ఒక్కటిగా ఉండలేరన్న వాదనకు తెరపడాలంటే కాసానిని గెలిపించుకుందాం. 93 బీసీల కులాల ఐక్య వేదిక అధ్యక్షులుగా జ్ఞానేశ్వర్ ఎంతో సేవ చేశారు.

- ఆంజనేయులు, రజక సంఘం నాయకుడు, బడంగ్‌పేట

మా సత్తాను చాటుతాం

బీసీలలో ఐక్యతపై కాంగ్రెస్ పార్టీ నేత వ్యాఖ్యలు ఏమాత్రం సరికాదు. రాజ్యాధికారం కోసం ఈ ఎన్నికల్లో బీసీల ఐక్యతను చాటుతాం. మా శక్తేంటో నిరూపిస్తాం. ఇప్పటికే బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు ఆయా రాజకీయ పక్షాలు వాడుతున్నాయి. చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని మాజీ సీఎం కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి ఇవ్వడం ద్వారా ఆ పార్టీ తమ చిత్తశుద్ధిని చాటుకున్నది. అందరం కలిసికట్టుగా బీసీ అభ్యర్థిని గెలిపించుకుని మా ఐక్యతను సమాజానికి చాటుతాం.

- కోట కుమార్‌యాదవ్, యాదవ సంఘం నేత, మియాపూర్

పార్టీలకతీతంగా ఒక్కటవుతాం

పార్లమెంటు ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీలమంతా ఒక్కటవుతాం. చేవెళ్ల నియోజకవర్గంలో బీసీ వర్గానికి చెందిన అభ్యర్థి కాసానిని ముక్తకంఠంతో ఒక్కటై అధిక మెజార్టీతో గెలిపించుకుంటాం. దీంతో కాంగ్రెస్ నేత వ్యాఖ్యలను మా ఐక్యతతో తప్పని నిరూపిస్తాం. బీసీ వర్గాలంతా ఇప్పటికైనా ఆయా రాజకీయ పక్షాలు ఓట్ల జిమ్మిక్కులను గుర్తించాలి. బీసీల కోసం పాటుపడే పార్టీలను, నేతలను గుర్తించి వారికి అండగా నిలవాలి. బీసీలంతా ఐక్యమైనపుడే మరింత మందికి మున్ముందూ అవకాశాలు వస్తాయి.

- వేముల రాజుసాగర్, ఉప్పరి సంఘం నేత, మియాపూర్

కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా చేవెళ్ల నియోజకవర్గం నుంచి బీసీ ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. కొన్నేండ్ల నుంచి రాజకీయపరంగా బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారు. అలాంటి రాజకీయ నాయకులకు కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతో గుణపాఠం నేర్పుతాం. బీసీల ఐక్యతను చాటితీరుతాం. పార్లమెంట్‌లో బీసీల తరపున గొంతు అయ్యే అవకాశాన్ని కాసానికి ఇవ్వాలి.

- తలారి వీరప్ప, గాజీపూర్, పెద్దేముల్

బీసీలంతా ఏకం కావాలి

బీసీలందరం ఏకతాటిపైకి వచ్చి రానున్న ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం. అప్పుడే బీసీల ఐక్యత సమాజానికి చాటినట్లు అవుతుంది. ఇలాంటి అవకాశం మళ్లీ రాదు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ వర్గానికి పెద్దపీట వేసి బీసీలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. బీసీల సత్తాను చాటేందుకు ప్రతి బీసీ బిడ్డ ఓ సైనికుడై బీసీ నాయకుడి గెలుపునకు కృషి చేయాలి.

- కె.లాలూయాదవ్, గాజీపూర్, పెద్దేముల్

బీసీ నాయకుడికి పట్టం కడుతాం

చేవెళ్ల గడ్డపై ఎంపీ ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి పట్టం కడుతాం. సంవత్సరాల నుంచి బీసీలకు బీఆర్ఎస్ పార్టీ అవకాశం ఇచ్చింది. బీసీల జనాభాలో బీసీలే ఎక్కువగా ఉన్నా బీసీలకు రావాల్సిన పథకాలు ప్రభుత్వాలు అందించడంలేదు. కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేస్తాం. బీసీలతోనే అభివృద్ధి సాధ్యమవుతుంది.

- నర్సింహ, లింగంపల్లి, కులకచర్ల

పార్లమెంటులో బీసీల గళం విప్పాలంటే..

పార్లమెంటులో బీసీల గళం విప్పేందుకు బీసీల నుంచే ఎంపీగా పార్లమెంటుకు పంపించాలి. చేవెళ్ల నుంచి చాలా సంవత్సరాల తరువాత బీసీ నేతకు అవకాశం వచ్చింది. దీన్ని బీసీలందరం ఐక్యంతో ఉండి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. చేవెళ్ల గడ్డపై బీసీ అభ్యర్థికి పట్టం కట్టేందుకు ప్రతి బీసీ ముందుకు రావాలి.

- బోయిని మొగులయ్య, అంతారం, కులకచర్ల

సర్ చెప్పినవారికే మా ఓటు

రాష్ట్రాన్ని సాధించారు. నీళ్లు తెచ్చారు. అందుకే కేసీఆర్ సర్ చెప్పినవారికే మా ఓటేస్తాం. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌కే మా ఓటు. కొందరికి అర్థంకాక మోసపోయి కాంగ్రెస్‌కు ఓటు వేశారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఐదు నెలలైనప్పటికీ మాయ మాటలే చెబుతున్నారు. మాలాంటి పేదవారికి ఇప్పటికీ ఎలాంటి సహాయం చేయలేదు.

- రామనర్సయ్య, అడ్డా కూలీ, సులేమాన్‌నగర్, రాజేంద్రనగర్

ఇప్పటికీ ఎలాంటి పథకాలందలేదు

కాంగ్రెస్ పాలనలో ఇప్పటికీ సామాన్యులకు ఎలాంటి పథకాలందలేదు. గ్యాస్ సిలిండర్ ధర రూ.500 చేస్తామన్నారు. అమలులోకి రాలేదు. మాయ మాటలు చెప్పే నేతలను ఎప్పటికీ నమ్మలేము. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే షాదీముబారక్ లబ్ధిపొందాం. సులేమాన్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్య గత ఎనిమిదేండ్లో ఎప్పుడూ లేకుండేది. ఇప్పుడు మళ్లీ నీటి కష్టాలు వచ్చేశాయి. కాసానికే ఓటు వేస్తాం.

- షేక్ ఇస్మాయిల్, సులేమాన్‌నగర్, రాజేంద్రనగర్

వేసవి దుక్కులతో లాభాలెన్నో...!

ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరి

రైతులకు సలహాలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

షాబాద్, ఏప్రిల్ 18: వేసవి దుక్కులతో రైతన్నకు అనేక ప్రయోజనాలు ఉంటాయి. ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుంది. తద్వారా భూసార అభివృద్ధికి తోడ్పడుతుంది. అంతే గాక కలుపు మొక్కలు, చీడపీడలను నివారించవచ్చు. పంటల సాగు పూర్తయ్యాక రైతులు తమ వ్యవసాయ భూములను అలాగే వదిలేస్తుంటారు. ఇలా చేయడం వల్ల కలుపు మొక్కలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అవి భూమిలోని పోషకాలను స్వీకరించడమే కాకుండా భూమిలో లోతైన పొరల నుంచి నీటిని లాగేస్తాయి. దీంతో భూమిలోని సారం దెబ్బతిని వానకాలం పంటల సాగుపై ప్రభావం పడుతుంది. ఈ ప్రమాదాన్ని నివారించడానికి రైతులు యాసంగి పంటలు చేతికందగానే దుక్కులను దున్ని భూములను ఆరబెట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

కలుపు మొక్కల నివారణ...

భూముల్లో ఏ పంటా వేయకుండా ఉంచడంతో కలుపు మొక్కలు పెరిగి భూసారానికి నష్టం కలుగజేయడంతో పాటు చీడపీడలకు ఆశ్రయం కల్పిస్తాయి. మొండి జాతికి చెందిన తుంగ అన్ని రకాల భూముల్లోనూ ఎదుగుతున్నది. వేసవిలో లోతైన దుక్కులు దున్నడం వల్ల వీటిని నివారించవచ్చు. పంట కాలం ముగిశాక భూములను ఖాళీగా ఉంచడం వల్ల పంటలను ఆశించే చీడపురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. దుక్కులు దున్నడం వల్ల వెలుపలికి వచ్చి బయటి ఉష్ణోగ్రతలకు చనిపోతాయి.

వర్షాకాలానికి ముందే దుక్కులు దున్నాలి..

వర్షాకాలం రాకముందే భూమిని మూడు దుక్కులుగా దున్నాలి. ఇలా చేయడం వల్ల తొలకరి వర్షాలకు నేల మెత్తబడి నీళ్లు భూమిలోకి ఇంకుతాయి. దుక్కులు లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకుంటే వర్షపు నీరు భూమిలోకి ఇంకి తేమను నిల్వ చేసే సామర్థ్యం పెరుగుతుంది. దుక్కి దున్ని భూమిని ఎండబెట్టడం ద్వారా కలుపు మొక్కలను నివారించవచ్చు. దుక్కులు దున్నే ముందు భూమిలో పశువుల పేడ, కంపోస్టు ఎరువులు వేయాలి. దీంతో సారవంతం అవడమే కాకుండా తేమ నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది.

దుక్కులతో భూమి గుల్లగా మారుతుంది

భూములను వృథాగా వదిలివేయడం వల్ల పొరలు గట్టి పడతాయి. పంటలు వేసిన సమయంలో నారు సరిగ్గా చొచ్చుకుని పోదు. దీంతో పోషక పదార్థాలు సరిగా అందక మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుంది. వేసవిలో లోతుగా దుక్కిదున్నడం వల్ల భూమి గుల్లగా మారుతుంది. దీంతో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాములు సంతతి వృద్ధి చెందుతుంది. ఇవి భూసార అభివృద్ధికి తోడ్పడతాయి. రైతులు తప్పనిసరిగా వేసవి దుక్కులు దున్ని వానకాలానికి సిద్ధం చేసుకోవాలి.

- వెంకటేశం, వ్యవసాయాధికారి, షాబాద్

బ్రిడ్జ్‌పోర్టు యూనివర్సిటీతో జేబీ విద్యా సంస్థల ఒప్పందం

విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యావకాశాలు

అమెరికా బ్రిడ్జ్‌పోర్టు యూనివర్సిటీ అధ్యక్షురాలు డేనియల్ విల్కెన్ వెల్లడి

మొయినాబాద్, ఏప్రిల్ 18 : అంతర్జాతీయ స్థాయిలో కూడా జేబీ విద్యా సంస్థల విద్యార్థులకు ఉన్నత విద్యలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే ఆలోచనతో జేబీఐఐటీతో ఎంఓయూ చేసుకోవడం జరిగిందని బ్రిడ్జ్‌పోర్టు యూనివర్సిటీ అధ్యక్షురాలు డేనియల్ విల్కెన్ అన్నారు. మండల పరిధిలోని జేబీ విద్యా సంస్థతో గురువారం బ్రిడ్జ్‌పోర్టు యూనివర్సిటీ ఉన్నత విద్య అనే అంశంలో ఎంఓయూ చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ఒప్పందం సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బ్రిడ్జ్‌పోర్టు యూనివర్సిటీ అమెరికాలో టాప్‌లో ఉన్న యూనివర్సిటీ అని తెలిపారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో కూడిన విద్యను యూనివర్సిటీ ద్వారా అందించడం జరుగుతుందని చెప్పారు. యూనివర్సిటీ విద్యా ప్రమాణాలను తెలంగాణ రాష్ట్రంలో కూడా అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా ఆన్‌లైన్ షార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లు కూడా పెరుగుతాయని చెప్పారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు మాట్లాడుతూ ఈ ఒప్పందంతో తమ కళాశాలలో బోధనా పద్ధతులు కూడా మెరుగు పరుచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్రిడ్జ్‌పోర్టు యూనివర్సిటీ ఇన్నోవేషన్, స్టాటజీ, అడ్వటైస్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎలెనా కాహిల్, తదితరులు పాల్గొన్నారు.



ఒప్పందం చేసుకుని లెటర్ అందుకుంటున్న జేబీ విద్యా సంస్థల బృందం

'ఏఆర్‌వో' నుంచే విధులు నిర్వహించాలి

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఏప్రిల్ 18 : పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనందున ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఏఆర్‌వో (అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి) కార్యాలయం నుంచే విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. గురువారం పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించి ఆర్‌డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఏఆర్‌వో కార్యాలయం నుంచే విధులు నిర్వహించాలని తగు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా వికారాబాద్ నియోజక వర్గానికి కేటాయించిన ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. జిల్లాలోని మేరీనాట్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి విద్యుత్, తాగునీరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదనపు కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దార్ లక్ష్మీ నారాయణ తదితరులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

మందుగుండు సామగ్రి పట్టివేత

షాద్‌నగర్, ఏప్రిల్18: నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న మందు గుండు సామగ్రిని షాద్‌నగర్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. షాద్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 527లోని భూమిలో బండ రాళ్లను తొలగించేందుకు అనుమతి లేని జిలెటిక్ మందు గుండు సామగ్రిని కొందరు వినియోగించారని తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన వంగూరి యాదయ్య, మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రానికి చెందిన యాదయ్య, శ్రీ లక్ష్మీ భవానీ ఎంటర్‌ప్రైజెస్ యజమాని భవానీ కలిసి మందు గుండును వినియోగించారని వివరించారు. అనుమతి లేకుండా వినియోగిస్తున్న 59 జిలెటిక్ మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో వంగూరి యాదయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఐ రామిరెడ్డి తెలిపారు. మిగతా ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు. త్వరలో పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తామని వివరించారు.

కోర్టు భవనానికి స్థలం కేటాయించాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసిన జిల్లా న్యాయవాదులు

వికారాబాద్, ఏప్రిల్ 18 : జిల్లా కోర్టు భవన నిర్మాణానికి భూమిని కేటాయించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గురువారం వికారాబాద్ క్యాంపు కార్యాలయంలో జిల్లా న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో కోర్టు భవనం కోసం సర్వే నంబర్ 296, 302, 303, 304, 306లోని భూమి ఎన్నేపల్లి పరిధిలోని హార్టికల్చర్ భూమిలో 15 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో వికారాబాద్ న్యాయవాద బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్, ఉపాధ్యక్షుడు సయ్యద్ కయ్యూమ్, న్యాయవాదులు గోవర్ధన్‌రెడ్డి, సంపూర్ణనాథ్, శ్రీనివాసరావు, బాలయ్య, శంకరయ్య, రవీందర్, పరశురాం, రాజు, నర్సింహులు, అనిల్‌కుమార్, సాయిరాం, సంజీవ్, శేఖర్ ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మొయినాబాద్, ఏప్రిల్18: చిలుకూరు బాలాజీ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను గురువారం రాత్రి ఆలయ అర్చకులు ప్రారంభించారు. మొదటి రోజు ఉదయం సెల్వర్ కూత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం సాయంత్రం శ్రీదేవి, భూదేవిలతో వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు, మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందరరాజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పుట్ట మన్నును తీసుకొచ్చి నవధాన్య అంకురాలను ప్రోక్షించారు. అనంతరం హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల్కృష్ణస్వామి, పరావస్తు రామాచారి, తిరుమల కిరణాచారి, కిట్టుస్వామి, కన్నయ్యస్వామి, నర్సింహ్మాచారి, నీల్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు గరుడ ప్రసాద వితరణ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అష్టదిక్పాలకులకు నైవేద్యంగా పెట్టిన గరుడ ప్రసాదాన్ని సంతానం లేని మహిళలకు వితరణ చేస్తారు. దీనికోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం ధ్వజారోహణం, 8 గంటలకు గరుడ ప్రసాదం వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. గరుడ ప్రసాదం స్వీకరిస్తే సంతాన ప్రాప్తి జరుగుతుందనే నమ్మకంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారని అర్చకులు తెలిపారు.